ప్రీమియం భారం.. బీమాకు దూరం

- పంటల బీమాకు స్పందన కరవు
- ముగిసిన గడువు
- ఒక శాతం రైతులు మాత్రమే చెల్లింపు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూరు శాతం నమోదు



పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

బిక్కవోలు: భూమిలో విత్తు నాటిన నుంచి పంట చేతికొచ్చేవరకూ అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. సాగు నీటి కష్టాలు, విత్తనాల కొరత, ఎరువులు దొరక్కపోవడం, తుపానులు.. ఇలా అనేక సుడి గుండాలను దాటాలి. ఆ సమయంలో వారికి ప్రభుత్వం అండ చాలా అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. పంట సాగులో మొదటి నుంచి చివరి వరకూ తోడున్నారు. వాటిలో పంటల బీమా గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. రైతుల తరఫున ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టింది. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. దీంతో కేవలం ఒక శాతం మందికి మాత్రమే బీమా ధీమా లభిస్తుంది.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడిసాయం అందిస్తామని వాగ్దానం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన ఏడునెలలు అవుతున్నా ఆ ఊసే మరిచారు. అలాగే పంటల బీమా ప్రీమియాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, ఇక బీమా ప్రీమియం ఎలా కట్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన స్పందన

అనపర్తి నియోజకవర్గంలో సుమారు 37 వేల రైతులు ఉండగా, వారిలో కేవలం 370 మంది రైతులు 50 వేల ఎకరాలకు గాను రూ.2,84,400 బీమా ప్రీమియం చెల్లించారు. టీడీపీ పాలనలో బీమా చెల్లించడం దండగా అనే అభిప్రాయం రైతుల్లో ఉంది. గతంతోనూ టీడీపీ అధికారంలో ఉండగా రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా, ఏ నాడు నష్టం జరిగినా పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే భావం రైతుల్లో నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక సార్లు గడువు పొడిగించినప్పటికీ వారి నుంచి స్పందన కరువైంది.

నియోజకవర్గంలో బీమా వివరాలు

మండలం	రైతులు	ఎకరాలు	నగదు
అనపర్తి	60	65	41,480
బిక్కవోలు	84	110	69,490
రంగంపేట	101	125	78,930
పెదపూడి	125	150	94,500
మొత్తం	370	450	2,84,400

గతంలో అందరికీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత నుంచి రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో రైతులకు కూడా ధీమా కలిగేది. ఇప్పుడు పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పాత పద్ధతి అమలు చేయాలి



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంట బీమాను అమలు చేయాలి. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పూర్తి స్థాయి పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ విధానం లేకపోవడంతో నష్టం కలుగుతుంది.

– తాళ్ల నీరంజన్ రెడ్డి, రైతు, బిక్కవోలు

అవగాహన కల్పించాం



పంటల బీమా ప్రీమియంపై రైతులకు క్షేత్రస్థాయిలో మా సిబ్బంది అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో తక్కువ మంది రైతులు ప్రీమియం చెల్లించారు. బీమా చెల్లించడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి బయటపడవచ్చు.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయాధికారి, పెదపూడి

క్లుప్తంగా

బిక్కవోలు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



బిక్కవోలు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఆశ

బిక్కవోలు: బిక్కవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఆశ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మలేరియా, జ్వరాల కేసుల నమోదు, డెంగీ పరీక్షలు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని జవ్వలదొడ్డి, రాజారావుపేట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి దోమలపై అవగాహన కల్పించారు. అక్కడి దోమల లార్వాను సేకరించి పరీక్ష కోసం రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వల్ల కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట వైద్యురాలు ఎం.దుర్గాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

బిక్కవోలు: గ్రామ సచివాయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఆధార్ నమోదు చేసుకొని ఆరేళ్ల వయసున్న చిన్నారులకు కొత్త కార్డుల కోసం ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం మోళ్లూరు, బలభద్రపురం-1, బిక్కవోలు-2, కొమరిపాలెం 2, గురువారం కొంకుదురు-1, బలభద్రపురం-2, బిక్కవోలు-3, కాపవరం, 24న కొంకుదురు-2, ఇల్లపల్లి, బిక్కవోలు-4, బలభద్రపురం-3 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు.

సత్రం భూముల్లో పంటలకు వేలం ఖరారు

రాజానగరం: స్థానిక రాజా కాంద్రేగుల జగన్నాథరావు బహదూర్ పంతులు అన్నదాన సత్రానికి చెందిన పంట భూముల్లో ప్రస్తుతం పండిస్తున్న పంటలను కోసుకుని సొంతం చేసుకునేందుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మండలంలోని సూర్యారావుపేటకు చెందిన వల్లభశెట్టి వెంకటరమణ రూ.5.10 లక్షలకు వేలం పాడుకుని హక్కులు పొందారు. రాజానగరం రెవెన్యూ పరిధిలోని తూర్పుగానుగూడెంలోని సర్వే నంబర్లు 20, 27, 28, 135లో ఉన్న 25.16 ఎకరాలలో 21 ఎకరాలలో వరి నాట్లు వేసి ఉండగా, 4.16 ఎకరాలలో చొప్ప గడ్డిని పండిస్తున్నారు. తనిఖీదారు టీవీఎస్ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలానికి 24 మంది ఒక్కొక్కరు ధరవత్తుగా రూ.25 వేలు చెల్లించినప్పటికీ వేలంలో మాత్రం నలుగురే పాల్గొన్నారని సత్రం కార్యనిర్వహణాధికారి డి. సురేష్ బాబు తెలిపారు.

రోడ్డుకిరువైపులా ప్రమాదకరంగా తుప్పలు



సుభద్రంపేట - ముకుందవరం రోడ్డులో పెరిగిపోయిన తుప్పలు

రంగంపేట: రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న తుప్పలను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. మండల పరిధిలోని సుభద్రంపేట-ముకుందవరం గ్రామాల మధ్య జి.దొంతమూరు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా తుప్పలు భారీగా పెరిగిపోయాయి. ఆ దారిలో ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తుప్పల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో భయపడుతున్నారు. వీటి వల్ల జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయాల పాలయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో సత్తా



విద్యార్థిని అభినందిస్తున్న విజయ రామరాజు

రాజానగరం: దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతున్న కె.సెల్విక్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో సత్తా చాటాడు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 10 నుంచి 14 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విషయాన్ని కరస్పాండెంట్ విజయ ప్రకాష్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సాగులో మెళకువలను వివరిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: రబీ వరి సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్ సూచించారు. పెదపూడి గ్రామంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ రైతులు సాగులో వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. ప్రతి మంగళ, బుధ వారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రైతులు ఆరుమిల్లి వాసు, అమ్మన్న చౌదరి, నిమ్మగడ్డ గోపి, కాకర సాయిబాబు, కాకర చందు, ఏఈఓ స్వామి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

పెదపూడి: స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నామని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ముగ్గళ్ల శివాలయం వద్ద ఇసుక స్టాక్ పాయింట్

సీతానగరం: ఉచిత ఇసుక కొందరు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. అనుమతులు లేని ర్యాంపుల్లో బాహాటంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అక్రమంగా ధనార్జన చేస్తున్నారు. ముగ్గళ్ల, సింగవరం ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామాల్లో స్టాక్ పాయింట్‌లు పెట్టి లారీలపై ఎగుమతులు చేస్తున్నారు. అయితే రెండు నెలల క్రితం మండలంలో పలు ప్రాంతాల్లో అధికారులు ఇసుకను సీజ్ చేశారు. ముగ్గళ్లలో పలు చోట్ల ఇసుక స్టాక్ పాయింట్లు అధికంగానే ఉన్నాయి. గోదావరి పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు జరిపి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి లారీలపై ఎగుమతి చేసి జేబులు నింపుకొంటున్నారు. ఇలా నిత్యం మండలంలోని అనధికార స్టాక్ పాయింట్లను అధిక సంఖ్యలో లారీపై అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అనుమతులు లేని ర్యాంపు నుంచి బాహాటంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నా, ట్రాక్టర్లపై ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నా, అనధికార స్టాక్ పాయింట్లు నెలకొల్పినా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నేరస్తుల వివరాలు అప్‌డేట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

- సైబర్, రోడ్డు, మహిళా భద్రతపై దృష్టి పెట్టాలి
- ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు : నేరస్తుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు కచ్చితంగా అప్‌డేట్ చేయాలని, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మిస్సింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ తదితర కేసులపై ఎస్పీ ఆరా తీశారు. బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రిఫ్ రాఫ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని స్పష్టం చేశారు. 112 నంబర్‌కు వచ్చే కాల్స్‌కు తక్షణమే స్పందించి, వెంటనే నేర స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. సారా, గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, దాడులు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై స్థానికుల నుంచి సమాచారం తీసుకుని దాడులు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సత్వరమే ఆచూకీ కనుగొని, కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల ముందస్తు చర్యలూ తీసుకోవాలన్నారు. సైబర్ భద్రత, రోడ్డు భద్రత, మహిళా భద్రత, ఇంటి భద్రతపై ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి చిరునామాగా ఎమ్మెల్యే బత్తుల

- నాలుగు నెలల సమయం ఇస్తున్నా
- ఆ తర్వాత నుంచి రోజూ అవినీతిని ఎండగడతా
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం



కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ఎన్నికల ముందు ఎంతో చేస్తానని హామీ ఇచ్చిన బత్తుల బలరామకృష్ణ.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అక్రమార్జనకు పాల్పడుతూ, థర్డ్ గ్రేడ్ వ్యక్తిలా మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ అవినీతి, అక్రమ దందాలు, దోపిడీకి చిరునామాగా ఎమ్మెల్యే బత్తుల నిలిచారన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రెస్‌మీట్‌లో తాను బత్తుల అవినీతిపై మాట్లాడానని, దానికి కౌంటర్‌గా తనపై అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. వాడు, వీడు అని సంబోధిస్తూ, బూతులు మాట్లాడటంతో ఆయన థర్డ్ గ్రేడ్ వ్యక్తిత్వం బయటపడిందన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటమి సహజమనీ, గెలుపు కోసం మాత్రమే చూసే వాడు అవకాశవాద రాజకీయ నాయకుడన్నారు. ఓడినా తాను ప్రజల మనిషినే అన్నారు.

అక్రమ పొత్తులతో గెలుపు

జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ దేశ ఎన్నికల్లో రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే ఓటమి తప్పలేదన్నారు. అక్రమ పొత్తులు, అవకాశవాద రాజకీయాల్లో బత్తుల ఆరితేరారన్నారు. వైఎస్సార్ సీపీలో ఉండగానే గాదరాడలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీతో పెట్టుకుని, ఆయన భార్య వెంకటలక్ష్మి గెలిచేలా, మరొకటి టీడీపీ ఎంపీటీసీని గెలిపించేలా అక్రమ పొత్తు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సొంత పార్టీలోనే కోవర్టుగా వ్యవహరించారన్నారు. తనకు కోనసీమలో 350 ఎకరాల భూమి, బెంగళూరులో లిక్కర్ వ్యాపారం ఉందంటూ మాట్లాడుతున్న బత్తులకు సవాల్ విసిరారు. ఎంపీటీసీ పదవిని కాపాడుకునేందుకు స్టే తెచ్చుకున్న బత్తుల రాజీనామా చేసి, పోటీకి దిగితే సాధారణ కార్యకర్తను పోటీకి పెట్టి గెలిపిస్తానని హెచ్చరించారు. బత్తుల లేకపోవడంతో వైఎస్సార్ సీపీ కోవర్టులు లేని స్వచ్ఛమైన పార్టీగా ఉందన్నారు.

ప్రతి పనికీ వసూళ్లు

నియోజకవర్గంలో రూ.1,773 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు తెచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల పేరిట రూ.1,377 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, 20 వేల ఇళ్ల పట్టాలను పేదలకు అందజేసిన స్థాయి తనదని జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని లిక్కర్ షాపులు కూటమికే దక్కాయని, వాటి నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్న ఘనత బత్తులకే దక్కిందన్నారు. తహసీల్దార్, కానిస్టేబుల్ నుంచి సీఐ వరకూ ప్రతి పోస్టుకు డబ్బులు వసూలు చేస్తున్న ఘనత కూడా ఆయనదేనని ఎద్దేవా చేశారు.

ఆ స్థాయి నాకు లేదు

రాజా మాట్లాడుతూ ఉద్యోగాలిస్తానని చెప్పి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు కాజేసిన స్థాయి తనది కాదని, ఎన్ఆర్ఈజీఎస్‌లో నామినేటెడ్, కాంట్రాక్టు వర్కుల్లో పర్సెంటేజ్‌లు వసూలు చేసే స్థాయి తనది కాదని, విజయవాడ బాటా షోరూంలో దొంగతనానికి పాల్పడిన స్థాయి తనది కాదని, కూతురికి సారె పంపి దాన్ని అడ్వర్టైజ్‌మెంట్ చేసుకున్న స్థాయి తనది కాదని, సీతానగరం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాతో అక్రమార్జనకు పాల్పడుతున్న స్థాయి తనది కాదని తెలిపారు. ఆయనకు నాలుగు నెలల పాటు సమయం ఇస్తున్నానని, ఆ తర్వాత నుంచి అవినీతి, అక్రమాలను ఎండగడతానన్నారు. బత్తులకు విశ్రాంతి, మనశ్శాంతి ఉండదని, అందుకే ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనక రాజు, పార్టీ నాయకులు నక్కా రాంబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి, కంటే వినయ్ తేజ, బొరుసు బద్రి తదితరులు పాల్గొన్నారు.

సర్వోదయ మండల్ సేవలను విస్తరిస్తాం

సీటీఆర్ఐ: రాష్ట్రంలో సర్వోదయ మండల్ సేవా కార్యక్రమాల పునరుద్ధరణలో భాగంగా అన్ని జిల్లాలకు కార్యనిర్వాహక కమిటీలను నియమిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంబాబు అన్నారు. లాలాచెరువులోని వీనస్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మహ్మద్ హుస్సేన్ ఫరీద్ షేక్ పర్యవేక్షణలో జిల్లా సర్వోదయ మండల్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆచార్య వినోభాబావే భూదాన్ మూవ్‌మెంట్ క్యాలెండర్, సర్వోదయ మండల్ దిక్సూచిని ఆవిష్కరించారు. ప్రజల్లో దేశభక్తిని పెంచడానికి, స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా పాతాళ వీరబాబు, ప్రతినిధిగా కొక్కిపాటు పున్నయ్య, ఉపాధ్యక్షురాలిగా వేమగిరి నిర్మలారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎరైజ్ రవితేజ, కోశాధికారిగా గండి రవికుమార్, సహాయ కార్యదర్శిగా బొడుపుల లీలావతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కలపల శేషయ్య, పౌర సంబంధాల అధికారిగా కొల్లూరి కిషోర్ రాజు, కార్యవర్గ సభ్యులుగా గంధం విజయ్ జాకబ్, బలే మోషే, కండెల్లి శేఖర్ నియమితులయ్యారు.

భారీ అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ దేవుని కోనేరు సమీపంలోని తలుపులమ్మ ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా ఉత్సవాలను ఘనంగా జరిపారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ముగింపు సందర్భంగా అన్నసమారాధన చేశారు. కోరుకొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు, విశ్వ హిందూ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై రూ.లక్ష విరాళం ఉత్సవ కమిటీకి అందజేశారు. అన్నసమారాధన సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించి, దానిలో విజేతలైన 60 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కోరుకొండ, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కరకుదురులో గేదెకు వైద్య పరీక్షలు చేస్తున్న జేడీ సూర్యప్రకాశరావు



రంగాపురంలో పాడి రైతులకు మందులు అందిస్తున్న నాయకులు



పురుషోత్తపట్నంలో మేకకు మందు వేస్తున్న డాక్టర్ ఫణీంద్ర

పెదపూడి: పాడి పశువుల సంరక్షణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని కరకుదురు, చింతపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు చేసి, టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 320 గేదెలు, ఆవులు, గొర్రెలు, కోళ్లకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వాటికి టీకాలు వేశారన్నారు. పశుగణన సర్వే సకాలంలో పూర్తి చేయాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వుండ్రు చంద్రకళ, కొల్లు లోవకుమారి, పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, మాజీ సర్పంచ్ సింగినీడి నాగతిరుపతిరావు (దత్తుడు), స్థానిక సాగునీటి సంఘం అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వరరావు, మండల పశువైద్యాధికారులు సోని, సాయికృష్ణ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో..

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందు, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, మేకలు,గొర్రెలకు టీకాలు వేశారు. 27 మంది రైతులకు చెందిన 29 పశువులు, 200 మేకలు, గొర్రెలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకూ గ్రామాల వారీగా జరిగే ఈ శిబిరాల్లో అనారోగ్యం బారిన పడిన పశువులు చికిత్స అందించడంతో పాటు వ్యాధులకు గురి కాకుండా ముందస్తు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, ఎంపీటీసీ కేతా ఏసురత్నం, కానాటి అప్పలస్వామి, కనుమూరి సాయిరాజు, చెల్లె జోసిబాబు, నడింపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

ఈలకొలనులో..

రంగంపేట: రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని మండల పశువైద్యాధికారి జహంగీర్ అన్నారు. ఈలకొలనులో నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం 54 పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వడిశలేరు పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్, జి.దొంతమూరు జూనియర్ వెటర్నరీ అధికారి ఉమాదేవి, పశువైద్య సహాయకులు రాణి, శివ, దుర్గాప్రసాద్, సురేష్, సత్యకుమార్, గోపాతమిత్ర శివ, రైతులు పాల్గొన్నారు.

83 పశువులకు వైద్యసేవలు

సీతానగరం: పురుషోత్తపట్నంలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో 83 పశువులు, 400 జీవాల (మేకలు, గొర్రెలు)కు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులను రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బొబ్బిల్లంకలో బుధవారం శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వీఏ మునీంద్ర, ఏహెచ్ఎలు వై.సుధాకర్, గీతిక, వెంకటేశులు, యాస్మిన్, చిట్టిబాబు పాల్గొన్నారు.